క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని టైలర్స్ కాలనీ, జాఫర్‌సాహెబ్ కాలువకట్ట, రామాలయం వీధి, రాజాగారి వీధి, జేవీఆర్ కాలనీ, ఎన్‌టీటీ కాలనీ, వేదాయపాళెం, పోలేరమ్మ చెట్టు వీధి ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాలను గురువారం నిర్వహించనున్నట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ బుధవారం తెలిపారు. నగర పాలక సంస్థ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్యబృందాలతో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాటన్ శారీస్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్‌లో రాజమండ్రికి చెందిన తిరుమల క్రియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాటన్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌కు విశేష స్పందన లభిస్తోంది. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఆధునీకతను స్వాగతించే వస్త్ర ప్రియులైన సింహపురీయుల కోసం కాటన్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను మరో పర్యాయం తీసుకొచ్చినట్లు నిర్వాహకుడు తిరుమల క్రియేషన్ అధినేత ఏ రవికుమార్ తెలిపారు. గురువారంతో ఎగ్జిబిషన్ ముగుస్తుందని చెప్పారు. ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు జరిగే ఎగ్జిబిషన్‌లో సమ్మర్‌లో హాయిగొలిపే హ్యాండ్‌బ్లాక్, కడిప్రింట్స్, పల్లవికాటన్స్, వసుంధరకాటన్, జార్జెట్, కాటన్ కోటాశారీస్, డ్రెస్‌మెటీరియల్స్ లేటెస్ట్ డిజిటల్ ప్రింట్ డిజైన్లు అందుబాటు ధరల్లో ఉన్నాయన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో గురువారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నెల్లూరు డివిజన్ కోఆర్డినేటర్ కళాంజలి అనంత్ బుధవారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే వేడుకల్లో వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించనున్నట్లు చెప్పారు.

చేనేత వస్త్ర, హస్తకళా ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): గ్రామీణ చేనేత, హస్త కళాకారుల సంఘ ఆధ్వర్యంలో నగరంలోని మినీబైపాస్‌రోడ్డులోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శ్రీసాయి చేనేత కాటన్ శిల్క్ ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు కంభంపాటి పద్మజ బుధవారం తెలిపారు. ఎక్స్‌పోలో గద్వాల్ పట్టుచీరలు, పోచంపల్లి శారీస్, డ్రెస్‌మెటీరియల్, నారాయణపేట, భాగల్‌పూర్ శారీస్, కాంతా బుటావర్క్ శారీస్, ఉప్పాడ పట్టు శారీస్, ఒన్‌గ్రామ్ గోల్డ్ నగలు, లేటెస్ట్ డ్రెస్ మెటీరియల్స్‌ను ఉత్పత్తి ధరలకే అందజేస్తున్నామని వివరించారు. ఈ నెల 14వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. నెల్లూరీయులు ఆదరించి చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం



సామూహిక వ్రతం చేస్తున్న మహిళలు

మనుబోలు : మనుబోలులోని శ్రీదేవి భూదేవి సమేత విష్ణాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు, వెంకటసాయి, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మహిళలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పెనుగొండ సుధాకర్, శాంత దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులయ్యాక తొలిసారిగా బుధవారం నెల్లూరుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. తొలుత అయ్యప్పగుడి సెంటర్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదాయపాళెం, కరెంటాఫీస్ సెంటర్, కొండాయపాళెం గేట్, కేవీఆర్ పెట్రోల్ బంక్ సెంటర్, ఆర్టీసీ, వీఆర్సీ, గాంధీబొమ్మ, కనకమహల్, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, రామ్మూర్తినగర్ మీదుగా రోడ్ షో, భారీ ర్యాలీని నిర్వహించారు. ప్రతి సెంటర్ వద్ద భారీ గజమాలలతో పార్టీ శ్రేణులు ఆహ్వానం పలికారు. జాతీయ రహదారి నుంచి రామ్మూర్తినగర్‌లోని తన కార్యాలయం వరకు ఓపెన్ టాప్ జీపులో రోడ్ షో సాగించి విజయసాయిరెడ్డి ప్రజలకు అభివాదం చేశారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్ రెడ్డి, పార్టీ నర్సరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ స్రవంతి, పార్టీ నెల్లూరు నగర, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్తలు ఖలీల్ అహ్మద్, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీ నడుమ నగరానికి వస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, పక్కన నెల్లూరు రూరల్, నగర సమన్వయకర్తలు ఆదాల, ఖలీల్ తదితరులు







విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ ఆదాల, నగర సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్, పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి



రామ్మూర్తినగర్ వద్ద గజమాలతో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అనిల్, తదితరులు



ఎంపీకి స్వాగతం పలికేందుకు జాతీయ రహదారిపై వేచి చూస్తున్న పార్టీ నాయకులు



ర్యాలీలో కళాకారుల సందడి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి



గాంధీ విగ్రహానికి నివాళులు



వేదాయపాళెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి



వీఆర్సీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశీర్వాదంతో జగనన్నే మళ్లీ సీఎం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాశీర్వాదంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తరువాత తొలిసారిగా నెల్లూరుకు వచ్చిన ఎంపీ విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం లభించిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ, పాలనను చూసి ప్రజలందరూ తమ వెంటే ఉన్నారన్నారు. జగనన్న ఒక మాట చెప్పారంటే తప్పక చేస్తారనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని తాము ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. ప్రజలు కూడా ఆశీర్వదిస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందనున్నదని తెలిపారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ద్వారా మరింత మంది ఔత్సాహికులను తయారుచేసి పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములను చేస్తామన్నారు. నారంపేటలోని ఇండస్ట్రియల్ పార్కు రెండో విడత పనులు సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని చెప్పారు. త్వరలోనే పరిశ్రమలను తీసుకొచ్చి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఎమ్మెల్యే మేకపాటి స్పందించారు. గత సంవత్సరం రోజులుగా తాను బలమైన ప్రత్యర్థి కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. బలమైన ప్రత్యర్థి వస్తేనే తమకు నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆనంద అగ్నిగుండ మహోత్సవం



శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పండరి భజనలో పాల్గొన్న కళాకారులు



అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): సాయిబాబా, పాండురంగస్వామి అనుగ్రహంతో పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం సమీపంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఆనంద అగ్నిగుండ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి 10గంటల నుంచి బుధవారం ఉదయం 10గంటల వరకు గురువు లక్ష్మీసాయి ఆధ్వర్యంలో పండరి భజన నిర్వహించారు. పండరి భజన గురువులు కొల్లపూడి శ్రీను, తులసీరాం సహకారాన్ని అందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 మందికిపైగా పండరిభజన గురువులు, 300మందికిపైగా భక్తులు పండరి భజనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన శ్రీకృష్ణలీలలు, ఘోరాకుంభార్ ఘట్టం, ఉగ్రనరసింహస్వామి దండకం భక్తులను మైమరిపించాయి. బుధవారం వేకువజాము నుంచి 400మందికి పైగా భక్తులు అగ్నిగుండం తొక్కారు. ఈ సందర్భంగా శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయినాథుడికి విశేష పూజలు నిర్వహించారు. సాయిదర్బార్ అద్దాల మందిరం చైర్మన్ మధుసాయి, సాయిదర్బార్ గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, శ్రీసాయి భక్త బృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

‘హంస’కు గుర్తింపుపై హర్షం

నెల్లూరు(అర్బన్): హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస)కు సీఎం వైఎస జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తింపు కల్పిస్తూ జీఓఎంఎస్ నంబర్ 24ను విడుదల చేయడంపై ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్ రావు, కమల్‌కిరణ్ హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని హరనాథపురంలో బుధవారం నిర్వహించిన హంస సమావేశంలో వారు మాట్లాడారు. వైద్యారోగ్యశాఖలో ఇప్పటి వరకు ప్రభుత్వ గుర్తింపు సంఘం ఏ ఒక్కటీ లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న హంసకు గుర్తింపు కల్పించాలని సంఘ రాష్ట్రాధ్యక్షుడు అరవపాల్ సీఎం వైఎస్ జగన్‌కు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) రాష్ట్రాధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి సహకారం అందించారన్నారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్ ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఇందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. త్వరలోనే జిల్లాలోని అన్ని తాలూకాల్లో నూతన కార్యవర్గాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కోశాధికారి శేషగిరిరావు, నాయకులు మజరుల్లా, శశికళ, వరప్రసాద్, ఖాదర్‌బాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేజర్ల సుధాకర్‌రావు

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి, ఖాళీ స్థలం పన్ను బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తున్నట్లు కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ సూచనల మేరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ సిబ్బంది, సచివాలయం అడ్మిన్, అమెనిటీస్ కార్యదర్శులతో బుధవారరం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ లోగా పన్ను బకాయిలు మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పన్నులను ప్రజలు బాధ్యతగా చెల్లించి కార్పొరేషన్‌కు సహకరించాలని కోరారు.

నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు

నెల్లూరు(బృందావనం): ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో వేదాయపాళెంలోని బ్రహ్మకుమారి జిల్లా కార్యాలయంలో గురువారం నుంచి మూడ్రోజుల పాటు మహాశివరాత్రి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం, లేజర్‌షో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరంలో శాంతి యాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు.

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విరాట్ నగర్‌లోని గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విశేష పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు.


కనులపండువగా ప్రాకారోత్సవం



ఉమామహేశ్వరుల ప్రాకారోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలో సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు బుధవారం రాత్రి ప్రాకారోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఉమామహేశ్వరులకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీవిఘ్నేశ్వర నృత్యనికేతన్‌కు చెందిన ఎస్ విజయలక్ష్మి శిష్య బృందం ప్రదర్శించిన జానపద, కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఉభయకర్తలుగా ఎడ్లపల్లి వెంకటేశ్వర్లునాయుడు, రత్నమ్మ దంపతులు వ్యవహరించారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజిసింగ్, ధర్మసింగ్, ఈఓ బొగ్గల మల్లికార్జునరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 8న నిర్వహించేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం కాదని, మహిళా పోరాట దినోత్సవమని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు విజయ పేర్కొన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని జనశక్తి నగర్‌లో వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులను కాలరాస్తూ, దాడులకు ప్రేరేపిస్తున్న మతతత్వ రాజకీయాల సామ్రాజ్యవాదం, పితృస్వామిక పీడన అణిచివేతలకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండమ్మ, అజిత, సునీత, అజిత, తదితరులు, పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శేష వాహన సేవ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం రాత్రి శేష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఆదిదంపతులను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. సంప్రదాయంలో భాగంగా ఉదయం చప్పరోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. చప్పరోత్సవానికి జీ బాలయ్య, రామచంద్రయ్య, రాజ్యలక్ష్మి, ఉదయకుమార్, కుసుమప్రియ, శేష వాహన సేవకు మోదెం వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం ధర్మాదాయం నుంచి దేవస్థానం ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శేష వాహనంపై ఆదిదంపతులు

దివ్యాంగుల మహాగర్జన సభ జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 9న విజయవాడలో నిర్వహించనున్న దివ్యాంగుల మహాగర్జన సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసుదేవరావుమాదిగ, తమిళనాడు ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాస్ కోరారు. నగరంలోని బీఆర్ అబేడ్కర్ భవన్‌లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యకర్తల సపమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని, వివాహంతో సంబంధం లేకుండా ప్రతిఒక్క దివ్యాంగుడికి అంత్యోదయ పథకం కింద 35 కేజీల బియ్యాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల డిమాండ్ల సాధన కోసం నిర్వహించే మహాగర్జనలో దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కృష్ణమాదిగ, వెంకటరమణయ్య, అరుణ, సుజాత, జానకి, చిట్టి బాబు,సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



వీహెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశం

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



వెంకటేశ్వరపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పరీక్ష సామగ్రి పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగర పాలక ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని కమిషనర్ వికాస్‌మర్మత్ బుధవారం పంపిణీ చేశారు. వెంకటేశ్వరపురంలోని నగర పాలక ఉన్నత పాఠశాలలోని 146 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెంట్రీబాక్స్, 6 పెన్నులను హెచ్‌ఎం మంజుల వాణి అందజేశారు.



బీవీఎస్ బాలికోన్నత పాఠశాలలో..

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో..

ఏపీ స్వచ్ఛంద సేవా సంస్థల ఐక్యత ఆధ్వర్యంలో నవాబుపేటలోని బీవీఎస్ బాలికోన్నత పాఠశాలలోని 170 మంది పదోతరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం విజయజ్యోతి, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రమేష్‌బాబు, సువర్ణ, సరస్వతి, రమేషరాజ్, హరిబాబు, కళ్యాణి, మాధవి, రమేష్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరీదేవి దేవస్థానం ప్రాంగణంలో కొలువైన మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం వంశపారంపర్యధర్మకర్త రత్నం జయరామ్, కార్యనిర్వహణాధికారి జే వెంకటసుబ్బయ్య తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని ఆదిదంపతులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

నెల్లూరు(బారకాసు): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సూచనల మేరకు నగర నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సమావేశ మందిరంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ప్రకటన తేదీ నుంచి ఎన్నికలు పూర్తయ్యేంత వరకు చేపట్టాల్సిన విధి విధానాలపై మాస్టర్ ట్రెయినర్స్ శిక్షణ ఇచ్చారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఎన్నికల సిబ్బంది సందేహాలను అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రెయినర్లు నివృత్తి చేశారు. అదనపు కమిషనర్ శర్మద, డ్వామా పీడీ వెంట్రావు, టీపీఆర్వో ప్రసాద్, ఏఈఆర్ఓ వెంకటేశ్వరరావు, మాస్టర్ ట్రెయినర్లు నరసింహప్రసాద్, శ్రీకాంత్, సుదర్శన్, రాంబాబు, వెంకటరావు, సుమన్, బ్రహ్మయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ట్రెయినర్లు